# ఇంకొక 'గుజరాత్' ఎక్కడా జరగనివ్వొద్దు



## గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం

పుస్తకావిష్కరణ సభ

**2002 జూన్ 16 సాయంత్రం 6గం.**

అధ్యక్షత

చాగంటి హరి

వక్తలు

డా. కె. బాలగోపాల్

కె. జి. కన్నబిరాన్

జీవన్‌కుమార్

విమల

బి. మోహన్‌రెడ్డి

ఏలేశ్వర నాగభూషణాచార్య

స్థలం

గుల్షన్ క్లబ్ హోలు, మెదక్

మనుషుల ఘోరమైన ప్రవర్తన గురించి వార్తలు విన్నప్పుడు, చదివినప్పుడు, మనమసలు నాగరికులమేనా? అన్న సందేహం వస్తుంది.

గుజరాత్ ఘటనల గురించి విన్నప్పుడు ఇంకొక మెట్టు కిందికి దిగి మనమసలు మనుషులమేనా? అన్న సందేహం చాలామందికి వచ్చింది.

స్త్రీలను మూకుమ్మడిగా రేప్ చేసి ముక్కలుగా నరికి తగలబెట్టిన వాళ్లు, చిన్న పిల్లలను పెట్రోలు పోసి సజీవంగా తగలబెట్టినవాళ్లు, రహదారి మీద పోతున్న వాహనాలను తాళ్లతో బంధించి పెట్రోలు పోసి వాహనంలోని ప్రయాణీకులతో సహా దానికి నిప్పు పెట్టి హతమార్చినవాళ్లు- వీళ్లు కూడా మనుషులే అయితే మనం ఏమిటి?

మూడు నెలలుగా ఈ ప్రశ్న మనల్ని వేధిస్తున్నది. అయితే ఈ ఆవేదనకు బాధ్యులయిన సంఘ్ పరివార్ పార్టీల వాళ్లు ఈ ప్రశ్నకు జవాబు చెప్పడం లేదు. 'మీరు గోధ్రా మారణకాండను ఖండించడం లేదు' అని ఎదురు దాడి చేస్తున్నారు. ఎవరూ ఆ మారణకాడను ఖండించ లేదు కాబట్టే గుజరాతీ హిందువులు కోపోద్రిక్తులయి ముస్లింల పైన దాడికి దిగారని దబాయిస్తున్నారు.

ఇందులో రెండు అబద్ధాలున్నాయి. గోధ్రా మారణకాండను ఎవరూ ఖండించలేదన్నది ఒక అబద్ధం. ఖండించడానికి అందరికీ టైం ఇచ్చిన తరువాతే హిందుత్వవాదులు పోగు చేసిన మూకలు ముస్లింలపైన దాడికి దిగారన్నది రెండవ అబద్ధం.

గోధ్రా మారణకాండ జరిగింది ఫిబ్రవరి 27 పొద్దున్న. 28 పొద్దున్న నుండే ముస్లింలపైన మారణకాండ పెద్ద ఎత్తున గుజరాత్ వ్యాప్తంగా మొదలయింది. కొన్ని చోట్ల 27 రాత్రే మొదలయింది. ఎవరైనా ఖండిస్తున్నారా లేదా అని వాళ్లు చూసిందెక్కడ? దాని కోసం ఆగిందెక్కడ?

కరసేవకులు అయోధ్యకు వస్తూపోతూ రైళ్లలోనూ స్టేషన్లలోనూ కనిపించిన ముస్లింలను పలువిధాల సతాయిస్తున్నారు. దీనికి ఆగ్రహించిన గోధ్రా రైల్వే స్టేషన్ వెండర్లు తమ నివాస ప్రాంతమైన సిగ్నల్ ఫాలియా అనే బస్తీ దగ్గర చెయిన్ గుంజి, బస్తీవాసులను కూడ గట్టి కరసేవకుల మీద కక్షతో వారు ప్రయాణిస్తున్న బోగీని తగలబెట్టారు. అందులో దాడి చేసిన వారి ఆగ్రహానికి కారకులయిన కరసేవకులే కాక ఇతర ప్రయాణీకులు - స్త్రీలూ పిల్లలతో సహా- ఉన్నారు. మొత్తం 58 మంది చనిపోయారు.

ఒకరి మీద కోపంతో వాళ్లు ప్రయాణం చేస్తున్న రైలు బోగీని మొత్తంగా తగలబెట్టి పసిపిల్లలతో సహా 58 మందిని చంపడం అతి ఘోరమైన చర్య. దానిని ఖండించని వారెవ్వరూ ఉండరు. ఆ ఆరోపణ పచ్చి అబద్ధం.

ఆ అబద్ధాన్ని అడ్డం పెట్టుకొని హిందుత్వవాద సంస్థలు సాగించిన మారణహోమం నిజానికి ఆ క్షణమే మొదలయినది కూడా కాదు. దాని కోసం ఏర్పాట్లు చాలా కాలంగా సాగుతున్నాయి. ఏ అదను దొరికినా ముస్లిం



ప్రజానీకం పైన మొత్తంగానే దాడి చేయడానికి వాళ్లు చాలా కాలంగా తయారుగా ఉన్నారు. గోధ్రా మారణకాండను అవకాశం చేసుకొని అప్పటికే తయారయిన పథకాన్ని అమలు చేశారు. అతిక్రూరంగా (పాశవికంగా అంటే పశువులను అవమాన పరచడం అవుతుంది) అమలు చేశారు.

మనుషుల మెదళ్లలో ఈదేశ చరిత్ర గురించి అబద్ధాలు చొప్పించారు, మనసులలో ముస్లింల గురించీ ఇస్లాం గురించీ విద్వేష విషాన్ని నింపారు, త్రిశూలాలు తల్వార్లు పంచారు, అబద్ధపు వదంతుల ప్రచారాన్ని ఒక కళగా అభ్యసించి ప్రదర్శించారు, ప్రభుత్వాన్ని జేబులో వేసుకొని పోలీసులను తమ ఏజెంట్లుగా మలచుకున్నారు, ముస్లింలను ఒక వర్గంగానే భౌతికంగా ఆర్థికంగా సాంఘికంగా అణచి వేయడానికీ ఏం చేయడానికీ వెలివేయడానికీ నాశనం చేయడానికీ కావలసిన భావ, భౌతిక వాతావరణాన్ని రూపొందించుకున్నారు.

గోధ్రా మారణకాండను ఆసరా చేసుకొని, అప్పటికే తయారుగా ఉన్న ఈ పథకాన్ని పకడ్బందీగా మరుసటి రోజు తెల్లవారి నుండి అమలు చేశారు.

ఫిబ్రవరి 28 నుండి దాదాపు మార్చి 15వ తేదీ దాకా సాగిన ఈ దౌర్జన్యకాండలో ముస్లింల నివాసాలు, దుకాణాలు, హోటళ్లు మొత్తం 22,515 అగ్నికి ఆహుతి అయ్యాయి, 3800 కోట్ల రూపాయల ఆస్తి ధ్వంసం అయింది, 1500 మంది దాకా హతమయ్యారు, స్త్రీలు లెక్కలేనంత మంది లైంగిక అత్యాచారానికి గురయ్యారు. లక్షన్నర జనాభా తమ ఆవాసాలను వదిలి పెట్టి శరణార్థుల శిబిరాలలో చేరారు.

ఈ వైనాన్ని క్లుప్తంగా వివరించే ప్రచురణ, మానవహక్కుల వేదిక అచ్చు వేసిన 'గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం'. 8 రోజుల పాటు అయిదు హక్కుల సంఘాల బృందంలో భాగంగా ముగ్గురు మానవహక్కుల నేదిక బాధ్యులు గుజరాత్‌లో చేపట్టిన పర్యటన ఫలితం ఈ ప్రచురణ.

దీని ఉద్దేశ్యం క్రూరత్వాన్ని మళ్లీ మళ్లీ జ్ఞాపకం చేసి ద్వేషాన్ని రెచ్చగొట్టడం కాదు. మత అసహనం ఇప్పటికే ఎంతటి విద్వేషపూరితమైన రూపం తీసుకుందో, ఎవరి పుణ్యాన తీసుకుందో వివరించి చెప్పి ఆ విషాన్ని తొలగించే ప్రయత్నానికి తోడ్పడటం. చట్టబద్ధ పాలననూ ప్రాథమిక హక్కులనూ ప్రమాణంగా పెట్టుకొని పరిపాలించవలసిన పాలనా యంత్రాంగం మైనారిటీ వర్గం పైన జరిగిన మారణకాండలో తానూ భాగమైన వైనాన్ని విపులీకరించి ఆ పాలనా విలువలను పునస్థాపించడానికి తోడ్పడడం.

క్లుప్తంగా చెప్పాలంటే, ఇంకొక గుజరాత్ ఎక్కడా జరగకుండా చూడడానికి కావలసిన చైతన్యం కలిగించడం ఈ ప్రచురణ లక్ష్యం.

చట్టబద్ధ పాలననూ ప్రాథమిక హక్కులనూ లౌకికవాద స్ఫూర్తినీ కాపాడుకోవడం కోసం, అసామాన్య వైవిధ్యం ఉన్న మన నాగరికతను ఒకే మూసలోకి కుదించి వేసే సంఘ్ పరివార్ సంకుచిత ప్రయత్నాన్ని ఎదుర్కొనడం కోసం ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే వారంతా ఒకటిగా కదిలి రావాలని పిలుపునిస్తూ-

11.06.2002 — మానవహక్కుల వేదిక (HRF)

దీని ఉద్దేశ్యం క్రూరత్వాన్ని మళ్లీ మళ్లీ జ్ఞాపకం చేసి ద్వేషాన్ని రెచ్చగొట్టడం కాదు. మత అసహనం ఇప్పటికే ఎంతటి విద్వేషపూరితమైన రూపం తీసుకుందో, ఎవరి పుణ్యాన తీసుకుందో వివరించి చెప్పి ఆ విషాన్ని తొలగించే ప్రయత్నానికి తోడ్పడటం. చట్టబద్ధ పాలననూ ప్రాథమిక హక్కులనూ ప్రమాణంగా పెట్టుకొని పరిపాలించవలసిన పాలనా యంత్రాంగం మైనారిటీ వర్గం పైన జరిగిన మారణకాండలో తానూ భాగమైన వైనాన్ని విపులీకరించి ఆ పాలనా విలువలను పునస్థాపించడానికి తోడ్పడడం.